

ఆంధ్రుల జీవనాడి..

అటవీ అందాల సవ్వడి

- జాతీయ ప్రాజెక్టుతో పోలవరానికి ప్రత్యేక గుర్తింపు
- పర్యాటకులను మైమరపించే పాపికొండల సోయగాలు
- గోదావరి పరవళ్లు ఇక్కడినుంచే ప్రారంభం
- అపారమైన అటవీ సంపద, సహజ వనరులు

బుట్టాయగూడెం:

ప్రకృతి అందాల నడుమ ఎంతో రమణీయమైనది పోలవరం నియోజకవర్గం. తన సహజ సౌందర్యాన్ని కాపాడుకుంటూ పాపికొండల్లోనే ప్రాణం పోసుకునే ఈ నియోజకవర్గం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. అందాల గోదావరి ఈ నియోజకవర్గం నుంచే తూర్పుగోదావరి వైపు ప్రవహిస్తుంటుంది. పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి. నరసాపురం, కొయ్యలగూడెం మండలాలు నియోజకవర్గంలో ఉన్నాయి. అయితే రాష్ట్ర విభజన తరవాత ఖమ్మం జిల్లాలో ఉన్న కుక్కునూరు, వేలేరుపాడుతో పాటు బూరుగంపాడులోని నాలుగు పంచాయతీలు కలిశాయి. దీనితో నియోజకవర్గం మొత్తం ఏడు మండలాలు అయ్యాయి. నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పర్యటించే వారికి అడవితల్లి అందాలు కనువిందు చేస్తుంటాయి. సెలయేటి సవడులు, కోయిలమ్మ పాటలతో ప్రకృతి అందాలు చూపరులను ఆనందింపచేస్తాయి. సుమారు 18 వేల హెక్టార్ల మేర అటవీ సంపద ఈ నియోజకవర్గంలోనే విస్తరించి ఉంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో ఇటీవల జరిగిన సర్వేల్లో విలువైన ఖనిజ సంపద, బొగ్గు ఉన్నట్లు గుర్తించారు. గోదావరి ఇసుక ఇక్కడ సహజంగానే లభిస్తుంటుంది. పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరి నది ఉంది. పోలవరంలో జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుంది. అలాగే కొవ్వాడ రిజర్వాయర్, పేట్రాల కాలువ, జలదారు వాగులున్నాయి. అలాగే బుట్టాయగూడెం మండలం జల్లేరు జలాశయం, పోగొండ రిజర్వాయర్, కోడేరు కాలువ, బైనేరు, జీలుగుమిల్లి మండలంలో బంగారు పాప చెరువు వాగులు ప్రవహిస్తున్నాయి. కుక్కునూరు మండలంలో గోదావరి నది ఉంది. అలాగే ఈ నియోజకవర్గంలో పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి వేలేరుపాడు, కుక్కునూరు ఐదు గిరిజన మండలాలు ఉన్నాయి. బుట్టాయగూడెం మండలం ఒక్కటే పూర్తిగా గిరిజన మండలం. ఇక కొయ్యలగూడెం మండలం రాజకీయ చైతన్యం కలిగిన మండలం. పోలవరం నియోజకవర్గంలోని గెలుపుపోటములు నిర్దేశించేది ఈ మండలమే. ప్రధానంగా బుట్టాయగూడెం మండలం నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.


పాపికొండల నడుమ బోటు ప్రయాణం

నియోజకవర్గ స్వరూపం.. రాజకీయ పోరు


1952లో ఈ నియోజకవర్గం కొవ్వూరు నియోజకవర్గంలో కలిసి ఉండేది. అప్పట్లో పిన్నమనేని రామచంద్రరావు ప్రాతినిధ్యం వహించేవారు. 1955వ సంవత్సరంలో పోలవరం నియోజకవర్గం ఏర్పడింది. అప్పట్లో ఈ నియోజకవర్గం జనరల్ స్థానంగా ఉండేది. ఆ రోజుల్లో సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మధ్యే పోటీ నెలకొనేది. 1955వ సంవత్సరంలో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పి.కోదండరామయ్య తొలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తరువాత 1962లో సీపీఐ నుంచి కరాటం బాబూరావు గెలుపొందారు. ఈ నియోజకవర్గం 1967లో ఎస్టీ రిజర్వుడుగా ప్రకటించారు. అప్పటినుంచి పోలవరం, బుట్టాయగూడెం మండలాల నుంచే అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అయితే వీరిలో బుట్టాయగూడెం మండలం దుద్దుకూరుకు చెందిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నాలుగుసార్లు పోటీ చేసి గెలుపొందడం విశేషం. అంతేకాకుండా 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి పోటి చేసి తెల్లం బాలరాజు నియోజకవర్గ ఎన్నికల చరిత్రలో 35,677 వేల మెజార్టీ సాధించి తిరుగులేని విజయం సాధించారు. 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బాలరాజుపై మొడియం శ్రీనివాస్ గెలిపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యరిగా పోటీ చేసిన తెల్లం బాలరాజు సుమారు 42 వేల 70 ఓట్లతో ఘన విజయం సాధించారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ బలమైన పార్టీలుగా ఉన్నాయి. వైఎస్ చలవతో గడచిన రెండు ఎన్నికల్లో తిరుగులేని పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కు, ప్రస్తుతం అభ్యర్థుల పోటీ నామమాత్రమే. జనసేన పార్టీ పరిస్థితి కూడా అంతే. ఒకప్పుడు ఎంతో పట్టున్న పార్టీగా పేరొందిన సీపీఐ, సీపీఎంలు నేడు పోటీని ఇచ్చే స్థితిలో లేవు. టీడీపీ గ్రూపు రాజకీయాలతో సతమతమవుతోంది. ఈ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉంది.

నియోజకవర్గంలోని ప్రత్యేకతలు

ఆంధ్రుల జీవనాడిగా పిలువబడే పోలవరం ప్రాజెక్టు గోదావరి నది అందాల నడుమ పర్యాటకుల మనసులు దోచుకుంటుంది. పోలవరం సమీపంలో ఉన్న పట్టిసీమ శివక్షేత్రం, గోదావరి మధ్యన వీరభద్రస్వామి దేవస్థానం ప్రకృతి సుందరంగా ఉంటుంది. ఇక్కడ శివరాత్రి మహోత్సవాలు బ్రహ్మాండంగా జరుగుతాయి. అందాల గోదావరి నడుమ పాపికొండల సోయగాలు పర్యాటకుల మనసును మైమరపింపజేస్తాయి. బుట్టాయగూడెం మండలంలో గిరిజనుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మ గుడి, వేలేరుపాడు మండలం పేరంటాళ్లపల్లి, పశ్చిమ మన్యంలో పచ్చని అడవి, ఎత్తైన చెట్లు, జలపాతాల సోయగాలు ఎంతగానో అలరిస్తాయి.

ఆధ్యాత్మిక క్షేత్రాలు..


బుట్టాయగూడెం మండలం కామవరంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి గుడి


పోలవరం పట్టిసీమ శివ క్షేత్రం

ఓటర్ల వివరాలు

1955లో 28,692మంది

ప్రస్తుతం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,52,592

పురుషులు 1,22,201

మహిళలు 1,30,380

ఇతరులు 11



అభివృద్ధి పథకాలు (రూ.కోట్లలో)

నాడు– నేడు	158 పాఠశాలలు	50.69
సచివాలయాలు	107	47.08
రైతు భరోసా	107	23.50
విలేజ్ క్లినిక్‌లు	80	14.40
పేదలందరికీ ఇళ్లు	6191	ఇంటికి లక్ష
సీసీ రోడ్లు	91	10.65
సత్యసాయి వాటర్ పథకం	170 గ్రామాలు	10 కోట్లు

ప్రజాపాలనలో సంక్షేమ ఫలాలు

పథకం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
జగనన్న విద్యాదీవెన	5016	26.16
జగనన్న వసతి దీవెన	4326	12.51
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	7736	19.24
వైఎస్సార్ ఆసరా	72209	114.29
వైఎస్సార్ పింఛను కానుక	42410	444.85
వైఎస్సార్ రైతు భరోసా	40570	93.33
అమ్మ ఒడి	89220	133.83
వైఎస్సార్ చేయూత	18557	58.14
జగనన్న తోడు	8516	8.5
కాపు నేస్తం	3776	9.09
వాహన మిత్ర	1367	3.20
పంటల ఉచిత బీమా	3316	85.54
ఈబీసీ నేస్తం	1651	2.47
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	16000	12

క్లుప్తంగా

సంక్షేమ పాలనకు జగనన్నే సీఎంగా రావాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని వైఎస్సార్‌సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో బూత్ కమిటీలు, మండలంలోని నాయకులు, కార్యకర్తలతో వేరువేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విజయరాజు మాట్లాడుతూ మళ్లీ సంక్షేమ ప్రభుత్వం కావాలంటే జగనన్నే సీఎంగా రావాలన్నారు. చంద్రబాబుని ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. జగనన్నను ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. బూత్ కమిటీలు, గృహ సారథులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం గురించి వివరించాలన్నారు. తాను కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని విజయరాజు అన్నారు. చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు జయప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల తేదీకి తక్కువ సమయం ఉందని, ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. నాయకులకు ఎంత బాధ్యత ఉందో బూత్ కమిటీ సభ్యులకు కూడా అంతే బాధ్యత ఉందన్నారు. రాజీనామా చేసిన వలంటీర్‌లను వినియోగించుకుని ముందుకు సాగాలన్నారు. పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు విభేదాలు పక్కన పెట్టి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, మండల కమిటీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మహిళా కమిటీ అధ్యక్షురాలు గుబ్బల సత్యవేణి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని వెంకన్న, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జ్యోతిక రెడ్డి, రాఘవరాజు, ఆదివిష్ణు, గురజాల పార్థసారధి, ముప్పిడి శ్రీనివాసరావు, తానిగడప రామకృష్ణ పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో 35 మంది వలంటీర్ల రాజీనామా


రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెం గ్రామ సచివాలయం-1, సచివాలయం-2కు చెందిన 35 మంది వలంటీర్లు సోమవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి స్వరాజ్యలక్ష్మికి అందజేయగా ఆమె లింగపాలెం ఎంపీడీవోకు సమర్పించారు. ఈ మేరకు 35 మంది వలంటీర్‌ల రాజీనామాలను ఆమోదించినట్లు ఎంపీడీవో పి.రాంబాబు తెలిపారు. సంక్షేమ సారథులుగా ప్రజల మన్ననలు అందుకుంటున్న తమపై ప్రతిపక్ష పార్టీలు అవలంభిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ రాజీనామాలు చేసినట్లు వలంటీర్లు చెప్పారు. ఇకపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

కొనసాగుతున్న రాజీనామాలు


దొరసానిపాడులో రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

ద్వారకాతిరుమల: దొరసానిపాడుకు చెందిన 20 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మికి అందజేశారు. అలాగే సీహెచ్ పోతేపల్లిలో 6 గురు, జి.కొత్తపల్లిలో ముగ్గురు వలంటీర్లు రాజీమా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిస్వార్థంగా ప్రజలకు చేరవేస్తున్న తమపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తట్టుకోలేక రాజీనామా చేసినట్లు చెప్పారు.

శ్రీనివాసపురంలో రాజీనామా


శ్రీనివాసపురంలో రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీనివాసపురంలో 5 గురు వలంటీర్లు సోమవారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ అధికారులకు అందజేశారు. ప్రస్తుతం తమ సేవలను దూరం చేయడంతో తమ ఉద్యోగాలకు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు.

మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీనే

కొయ్యలగూడెం: రాష్ట్రంలో మళ్లీ పాలనలోకి వచ్చేది మనమే అని, దేవుని ఆశీస్సులు, ప్రజల దీవెనలు మనకు పుష్కలంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం సీతంపేట, నరసన్నపాలెం, బయ్యన్నగూడెం గ్రామాలలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్వేలు సైతం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడబోతోంది అంటూ ఇస్తున్న ఫలితాలను చూసి ప్రతిపక్షాల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. మండుటెండలను సైతం లెక్క చేయక ప్రజలు వైఎస్సార్‌సీపీ గెలుపును కోరుతూ స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటూ మాలో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారని బాలరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున స్థానిక మహిళలు బాలరాజు దంపతులకు హారతులు పట్టి స్వాగతం పలుకుతునా్రు. ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తాం.. జగనన్న రుణం తీర్చుకుంటాం అంటూ ముక్తకంఠంతో పేర్కొనడంతో బాలరాజు దంపతులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచులు తోటకూర పద్మావతి, కరెడ్ల ప్రభావతి, లింగిసెట్టి అనంతలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ తోట జయబాబు తదితరులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం: సీతంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి

జగనన్నను ప్రజలు ఆశీర్వదించాలి

జంగారెడ్డిగూడెం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు ఆశ్వీరదించి మరోసారి అధికారంలోకి తీసుకురావాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు కోరారు. మండలంలోని దేవులపల్లి, పుట్లగట్లగూడెం, గురవాయిగూడెం, చక్రదేవరపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు విజయరాజుకు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్‌ని గెలిపించాలంటూ విజయరాజు ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల వేళ మాయ మాటలు చెప్పే కూటమి నేతలను నమ్మవద్దని కోరారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరి బాబు, పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని వెంకన్న, మహిళా నేత పొన్నాల అనిత, సర్పంచ్‌లు దోరేపల్లి సత్యనారాయణ, గుబ్బల సత్యవేణి, గెల్లా వెంకటరమణ, ఎంపీటీసీలు ప్రగడ వెంకటలక్ష్మి, కొయ్య రమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు ఎలికే పవన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం రూరల్: పుట్లగట్లగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కంభం విజయరాజు

బరిలో నిలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులు

బుట్టాయగూడెం: పోలవరం అసెంబ్లీ ఎన్నికల బరిలో 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్ ప్రక్రియ జరుగ్గా మొత్తం 34 సెట్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. 26వ తేదీన నామినేషన్‌ల పరిశీలన అనంతరం 13 నామినేన్లను అధికారులు ఆమోదించగా సోమవారం ఉపసంహరణలో కారం మల్లేశ్వరరావు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో 12 మంది పోటీలో నిలిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యతేజ తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తెల్లం రాజ్యలక్ష్మి, బీఎస్పీ అభ్యర్థిగా మడకం వెంకటేశ్వరరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి దువ్వెల సృజన, జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజు, యువతరం అభ్యర్థిగా ఉయికే మంగమ్మ, భారత్ ఆదివాసీ అభ్యర్థిగా మొడియం శ్రీనివాసరావు, గోండ్వానా దండకారణ్య అభ్యర్థిగా మడకం వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులుగా సరియం రామ్మోహన్‌రావు, మొడియం సూర్యచంద్రరావు, కాకా కృష్ణ, బాడిస బుజ్జి దొర, సరియం సూరమ్మ పోటీలో నిలిచారు.

చింతలపూడి బరిలో 8 మంది

చింతలపూడి: నామినేషన్ల ఉపసంహరణ అనంతరం చింతలపూడి (ఎస్సీ) అసెంబ్లీ బరిలో 8 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్లు రిటర్నింగ్ అధికారి కె అద్దయ్య విలేకరులకు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కంభం విజయరాజు, టీడీపీ నుంచి సొంగా రోషన్‌కుమార్, ఇండియా కూటమి అభ్యర్థిగా ఉన్నమట్ల ఎలీజా, బహుజన పార్టీ నుంచి లక్కపాం వెంకట చైతన్య, స్వతంత్ర అభ్యర్థులుగా ఎస్తేరు రాణి, పచ్చిగోళ్ళ జాన్ ధర్మతేజ, కలపాల ప్రసాద్, తొర్లపాటి శ్రీనివాసరావు పోటీలో నిలిచారు.

జోరుగా ప్రచారం

కామవరపుకోట, చింతలపూడి, ద్వారకాతిరుమల: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే అభ్యర్థులే కాకుండా వారి తరఫున పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సోమవారం కామవరపుకోట మండలంలో కామవరపుకోట, తడికలపూడిలో పార్టీ నేతలతో కలిసి ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి మోడల్ కాలనీలో ఎంపీపీ బి.రాంబాబునాయక్, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు ద్వారకాతిరుమల మండలంలో ద్వారకాతిరుమల, దేవినేనివారిగూడెం, మెట్టగూడెం, సీహెచ్.పోతేపల్లి గ్రామాల్లో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు పార్టీ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.


కామవరపుకోటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, పార్టీ శ్రేణులు


తడికలపూడి ప్రచారంలో జెడ్పీటీసీ రమేష్, పార్టీ శ్రేణులు


చింతలపూడి మోడల్ కాలనీలో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు


ద్వారకాతిరుమలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలంటూ ప్రచారం చేస్తున్న ఆ పార్టీ నేతలు


మెట్టగూడెంలో వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ఆ పార్టీ కరపత్రాన్ని చూపుతున్న స్థానికులు